క్లుప్తంగా

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

కొండపి: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతాయని చీఫ్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఉదయం మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 515 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 52 మంది హాజరవుతున్నారన్నారు. సీసీ కెమెరా పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా రమణారెడ్డి విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని చిన్నగొల్లపల్లిలో నాగులవేటి ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశ్వస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహ బాబు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వేములపాడు చెక్కా బాలచెన్నయ్య, ధర్మపత్ని సుబ్బరత్నమ్మ, రామచంద్రరావు, పద్మజలు వేద మంత్రాల నడుమ కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ నృసింహ స్వామి జయంతి వేడుకలు



జమ్ములపాలెంలో లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి జయంతి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి పంచామృత అభిషేకాలు, కుంకుమ, గోత్ర నామార్చనలు, విశేష పూజలు చేశారు. ఉభయదాతలు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించి శాంతి కళ్యాణం గొట్టిముక్కల వెంకట కృష్ణంరాజు, రమాదేవిలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు దేవాలయ కమిటీ అన్నదానం చేశారు. రాత్రికి గ్రామోత్సవం కనులపండువగా సాగింది.

చలివేంద్రం ప్రారంభం



పామూరులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు

పామూరు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మానవతా చైర్మన్ కె.రామిరెడ్డి, కార్యదర్శి బాబురావు, తోట రమేష్, వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, తూరెడ్డి వెంకటేశ్వర్లు, పి.తిరుపతిరెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగం



విద్యార్థులతో నీతి కథలు చెప్పిస్తున్న ఉపాధ్యాయులు, గ్రంథపాలకుడు

సీఎస్‌పురం(పామూరు): గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థుల మేధోశక్తికి ఎంతో దోహదపడతాయని హెచ్‌ఎం ఎస్.వెంకట్రామయ్య, గ్రంథ పాలకుడు ఆళ్ల భాస్కరరావు అన్నారు. స్థానిక పాఠశాలలో జరుగుతున్న గ్రంథాలయ వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఇంగ్లిష్ పదాలు నేర్పించడం, చదివించడం వాటిని విద్యార్థులతో చెప్పించారు. సైన్స్‌కు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రమీల, కె.సంధ్య, విద్యార్థులు ఉన్నారు.

అన్నదాత ఆక్రందన

ఆలకించేదెవరు..?

- గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం
- అరకొరగా కందుల కొనుగోళ్లు
- ఈ క్రాప్ చేయించుకోని రైతుల వద్ద మూలుగుతున్న కందులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



సీతారాంపురంలో కందుల కొనుగోలు



రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన కందులు

హనుమంతునిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నదాతలకు కష్టాలు ప్రారంభమయ్యాయి. కనీసం కొనుగోలు కేంద్రాలను సైతం ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు కనీస మద్దతు ధర లభించడం లేదు. అరకొరగా కేంద్రాలు ఏర్పాటు చేసినా రైతుల వద్ద నుంచి పూర్తిస్థాయిలో కందులు కొనుగోలు చేయలేదు. దీంతో ఆరుగాలం కష్టం మొత్తం ఏం చేయాలో తెలియక ఇళ్లలోనే ఉంచుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. మండల పరిధిలో సీతారాంపురం గ్రామంలో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. క్వింటా కందులు నాణ్యత పరిమాణం బట్టి ప్రభుత్వం నిర్ణంచిన ధర రూ 7,550 వంతున రైతుల నుంచి సొసైటీ వారు కొనుగోలు చేస్తున్నారు. అది కూడా పంట పండించిన రైతులందరి వద్ద కందుల కొనుగోలు చేయడం లేదు. కేవలం పంటను ఈ క్రాప్ రిజిస్ట్రేషన్ చేసిన రైతుల గింజలనే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనేవారే కరువై..

అప్పులు చేసి చెమటోడ్చి పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. దీంతో పంట ఉత్పత్తులన్నీ ఏం చేయాలో తెలియక రైతులు ఇళ్లలోనే నిల్వ ఉంచుకున్నారు. ఓ వైపు పెరుగుతున్న అప్పులు..మరోవైపు గిట్టుబాటు ధరతో రైతులు మదనపడుతున్నారు. మండలంలో ఇప్పటి వరకు కందుల కొనుగోలు కేంద్రం నుంచి దాదాపుగా 130 టన్నులు కందులు సొసైటీ వారు కొనుగోలు చేశారు. అయితే కేవలం ఈ క్రాప్ చేసిన రైతుల కందులను మాత్రమే రైతులను కొనుగోలు చేశారు. ఈ క్రాప్ చేయించుకొని రైతుల నుంచి కందులు కొనుగోలు చేయడం లేదు. మినుములు, అలసంద కూడా ప్రభుత్వం నుంచి గింజ కొనుగోలు చేయలేదు. దీంతో దళారులు అడిగిన ధరలకు కొంత మంది రైతులు అమ్మేసుకున్నారు. ఈ ఏడాది ఏ పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అందరం అప్పుల పాలయ్యాయని రైతులు డి.వెంకటసుబ్బయ్య, జి.సుబ్బయ్య వాపోయారు.

> **అరకొరగా కొన్నారు:**
>
> 
>
> ప్రభుత్వం అరకొరగా కందులు కొనుగోలు చేశారు. చాలా మంచి రైతుల వద్ద ఇంకా కందులు ఉన్నాయి. కానీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. 100 క్వింటాళ్ల మినుములు కూడా ధర లేక ఇళ్లలోనే మూలుగుతున్నాయి. ఈ ఏడాది ఏ పంట సాగు చేసినా గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలే మిగులుతున్నాయి.
>
> – గాయం సుబ్బయ్య, హాజీపురం

ఆలయాల్లో దద్దాల ప్రత్యేక పూజలు



లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దద్దాల నారాయణ యాదవ్



వెలిగండ్లలో పూజలు చేస్తున్న దద్దాల

కనిగిరిరూరల్:

కనిగిరి, వెలిగండ్ల మండలాల్లోని పలు ఆలయాల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీ నరసింహ స్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక కేటీఆర్ స్కూల్ ఆవరణలోని ఆలయంలో దద్దాల నారాయణ యాదవ్ విశిష్ట పూజలు చేశారు. స్వామి కల్యాణం, హోమ యజ్ఞా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్, కేటీఆర్ విద్యా సంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి.. దద్దాల నారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఆవుల భాస్కర్‌రెడ్డి, జి.ఆదినారాయణరెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, దాసరి మురళీ, పులి శ్రీనివాసులరెడ్డి, కే లక్ష్మీ మోహన్, శ్రీహరి, పాశం కొండయ్య, అచ్చాల శ్రీను, ఈర్ల శ్రీను, కంటు కేశవ పాల్గొన్నారు.

వెలిగండ్ల మండలంలోని మొగుళ్లూరు పంచాయతీ బూడిదపాలెంలో ఉన్న పల్నాటి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి తిరునాళ్ల, కొలుపుల మహోత్సవం పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి, ఎలికా రమణయ్య, ఆవుల భాస్కర్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, స్వర్ణ ఏడుకొండలు, గూడూరి అనీల్ కుమార్, కసిరెడ్డి శ్రీను, పాతకొట్టు రాము, పల్నాటి వెంక్రటరెడ్డి, చిరువెళ్ల సురేంద్ర, కోటేశ్వరరావు, ఆదవులు నారాయణ, సాయి, గణేశ్వరం తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల మండలం హుస్సేన్ పరం పంచాయతీలో ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకుని ఇంట్లో ఉంటున్న దుగ్గినేని వెంకటేశ్వర్లును దద్దాల పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుధాకర్, శివరామిరెడ్డి, యర్రయ్య, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల బంధువుల ఆందోళన



పామూరు బస్టాండ్‌లో రాస్తారోకో చేస్తున్న మృతుల బంధువులు

కనిగిరిరూరల్: బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని పట్టాభిరామాపురానికి చెందిన పాలిపోగు పోలయ్య, మర్రి హనోక్‌లు మృతి చెందిన సంగతి విదితమే. కాగా మృతులు..ఆయా కుటుంబాలకు పెద్ద దిక్కు. కూలి పని చేసుకుని జీవనం సాగించే వీళ్లే.. ఆ కుటుబాలకు జీవనాధారం. ఈ క్రమంలో మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం బంధువులు స్థానిక పామూరు బస్టాండ్‌లో వాహనాలను నిలిపి ఆందోళనకు దిగారు. కారు యజమాని అధికార పార్టీ నేతకు బంధువు కావడంతోనే పోలీసులు తమను పట్టించుకోవడం లేదని, దళితులైన తమకు అన్యాయం చేస్తున్నారంటూ ఆరోపిస్తూ కుటుంబసభ్యులు రోడ్డెక్కారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్రకు, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం సర్దిచెప్పి ధర్నా విరమింప చేశారు. అనంతరం పెద్ద మనుషులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులతో మాట్లాడారు. ఒప్పంద చర్యలు చేపట్టి..ఆందోళనను ఆపారు. దీంతో మృతుని కుటుంబసభ్యులు తాత్కలికంగా ధర్నా విరమించారు. మృతదేహాలకు సోమవారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మూడు గేదెలు మృతి



విద్యుత్ లైన్ తీగలు తగిలి మృతి చెందిన గేదెలు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని వెంగపల్లి పొలాల్లో విద్యుత్ తీగలు తగిలి మూడు గేదెలు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. వెంగపల్లి పొలాల్లో వనుకూరి చెంచిరెడ్డిపొలంలో ఉన్న విద్యుత్ లైన్ తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో అటు వైపు మేతకు వెళ్లిన కొండారెడ్డికి చెందిన మూడు గేదెలు తీగలు చుట్టుకొని షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందాయని బాధితుడు రాయ వెంకటకొండారెడ్డి ఆవేదన వ్యక్తంచేశాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మూగ జీవాలు ప్రాణాలు కోల్పోయాయి. వాటి విలువ రూ.లక్షల వరకు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ధర్నాను విజయవంతం చేయండి

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, డిమాండ్ చేస్తూ సోమవారం ఒంగోలు ప్రకాశం భవనం ఎదుట తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నారిశెట్టి వెంకటరామయ్య, షేక్.పదుషా, జిల్లా కార్యదర్శి అరియారం సురేష్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం తక్షణం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. అదేవిధంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో గందరగోళం తొలగించాలని, సీనియర్టీ లిస్టులో లోపాలను తొలగించాలని కోరారు. ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగుతుందని, ఉపాధ్యాయులకు జరిగే తీవ్ర నష్టాన్ని నిరసన ద్వారా తెలియజేయాల్సిన ఉపాధ్యాయులందరిపై ఉందన్నారు. ధర్నాకు మండలంలోని ఉపాధ్యాయులంతా హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

సింగరాయకొండ: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కందుకూరు ఫ్లై ఓవర్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జరుగుమల్లి మండలం వావిలేటిపాడు ఎస్టీ కాలనీకి చెందిన కంది గోపి శనివారం సాయంత్రం కందుకూరులో ఉంటున్న చెల్లిన చూడటాని పోయి తిరిగి వస్తున్న క్రమంలో కందుకూరు ఫ్లైఓవర్ సమీపంలో జాతీయ రహదారి సమీపంలోకి వచ్చేసరికి 11 గంటల సమయంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడరును ఢీకొనగా తలకు, ఒంటిపై తీవ్ర రక్త గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జాతీయ రహదారి అంబులెన్సులో ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారని ఎస్సై తెలిపారు. సంఘటన పై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర పేర్కొన్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి

హనుమంతునిపాడు:

ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎం మాధవరావు సూచించారు. మండల పరిధిలోని కంభం కనిగిరి రహదారిలో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు, వాహన లైసెన్సులను విధిగా వాహనదారులు ఉంచుకోవాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.



కంభం రోడ్డులో వాహణాలు తనిఖీ చేస్తున్న ఎస్సై

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



టంగుటూరు గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం

టంగుటూరు: విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన గ్రంథాలయ నిర్వాహకుడు వర్దన్‌రాజు అన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రేడింగ్ కూలీల ఆటో బోల్తా



అదుపుతప్పి బోల్తా పడిన ఆటో

పొన్నలూరు: పొగాకు గ్రేడింగ్ కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో మహిళా కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఓవీ రోడ్డుపై ఆదివారం జరిగింది. బాధితుల తెలిపిన వివరాలు మేరకు... పొట్టి శ్రీరాముల నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణానికి చెందిన 35 మంది మహిళా కూలీలు గత నెల రోజులుగా పొన్నలూరు మండలం నాగిరెడ్డిపాలెంలో పొగాకు గ్రేడింగ్ పనులకు వస్తున్నారు. అయితే రోజు మాదిరిగానే ఆదివారం కూడా పొగాకు గ్రేడింగ్ పనులకు ఆటోలో బయలుదేరారు. ఆటో పొన్నలూరు తహసీల్దార్ కార్యాలయం సమీపంలోకి రాగానే ఆటో మరమ్మతులకు గురై ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలోని మహిళలు కింద పడిపోవడంతో 10 మందికి గాయాలయ్యాయి. స్థానికులు మహిళా కూలీలను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో ఎవరికి కూడా తీవ్రమైన గాయాలు కాకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పామూరులో శాఖాహార ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ కేంద్ర సభ్యులు

పామూరు: శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పిరమిడ్ ధ్యానకేంద్ర నిర్వాహకులు గుత్తి రమణయ్య, పందిటి అల్లూరయ్య అన్నారు. స్థానిక పిరమిడ్ ధ్యానకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం శాఖాహారం ఆవశ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టిక విలువలతో కూడిన శాఖాహారమే ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రతి వ్యక్తి వారి వయస్సును బట్టి నిత్యం కొన్ని నిముషాలైనా ధ్యానం చేయాలన్నారు. ధ్యానం ద్వారా ఆరోగ్యం సాధ్యమన్నారు. ర్యాలీలో సోమిశెట్టి మాల్యాద్రి, పి.తిరుపతిరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

వైభవంగా మహానివేదన, అభిషేకోత్సవం



ప్రదక్షిణోత్సవంలో ఆలయ కమిటీ, భక్తులు



అభిషేకోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ, అభిషేకోత్సవం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణస్వామి మూలవిగ్రహ మూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవ మూర్తులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు



పాతూరులో పోలేశమ్మకు పొంగళ్లు తీసుకెళ్తున్న భక్తులు



దొంతులమ్మ గుడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

కనిగిరిరూరల్: పట్టణంలోని గ్రామ దేవతలకు ఆదివారం భక్తిశ్రద్ధలతో పొంగళ్ల మహోత్సవాలు నిర్వహించారు. పాతూరులోని గ్రామ దేవతలైన పోలేశమ్మ, గంగమ్మకు దేవస్థాన కమిటీ నిర్వాహకులు భూతలపల్లి విజయమ్మ ఆధ్వర్యంలో పొంగళ్ల మహోత్సవం నిర్వహించారు. తప్పెట్ల తాళాలతో అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించారు. 10,13వ వార్డులకు చెందిన మహిళలు, పాతూరు నుంచి కంభం రోడ్డులోని అమ్మవారి గుడి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి పొంగళ్లు సమర్పించారు. మాధవరెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక గార్లపేట రోడ్డులోని దొంతులమ్మ తల్లి దేవస్థానంలో పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఇందిరాకాలనీ, 1వ, 20వ వార్డుల్లోని మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పొంగళ్ల నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూసలబండ్లు, పూల బండ్ల ఊరేగింపు జరిగింది.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన యువకులు

పొన్నలూరు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పొన్నలూరు మండలం చెన్నిపాడు అడ్డరోడ్డు సమీపంలో ఆదివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు... గిద్దలూరు ప్రాంతానికి చెందిన రజనీకాంత్, రంగస్వామి పనులు నిమిత్తం కందుకూరు వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై గిద్దలూరు బయలుదేరారు. ఈ క్రమంలో పొన్నలూరు మండలం చెన్నిపాడు అడ్డ రోడ్డు సమీపంలోకి రాగానే ఒకసారిగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లడంతో ఇరువురు కింద పడిపోయారు. దీంతో రజనీకాంత్ చెయ్యి విరిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే రంగస్వామికి కూడా శరీరంపై అక్కడక్కడ గాయాలయ్యాయి. దీంతో ప్రయాణికులు 108కి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చికిత్స కోసం క్షతగాత్రులను కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.